నేత్రపర్వం.. గంగనీళ్ల ఉత్సవం



దిలావర్‌పూర్‌లో పోచమ్మ తల్లికి వలతో స్వాగతం పలుకుతున్న భక్తజనం

సారంగాపూర్, దిలావర్‌పూర్ న్యూస్‌టుడే : గంగ నీళ్లు తెచ్చి.. అడెల్లి పోచమ్మకు పోసి.. అంటూ భక్తిపారవశ్యంతో సాగిన గంగనీళ్ల జాతర ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. శనివారం అడెల్లిలోని పోచమ్మ ఆలయం నుంచి ఆభరణాలతో గోదావరి తీరానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు ఆదివారం రాత్రి ఆలయానికి తిరిగి వచ్చారు. వెండి కడవలో తీసుకొచ్చిన గోదావరి జలం, స్థానిక కోనేటి నీటితో ఈవో రమేష్ ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసశర్మ పోచమ్మ తల్లికి అభిషేకించి ఆభరణాలను అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో జాతర ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం వేకువజామున గోదావరి నీటితో అమ్మవారి ఆభరణాలను శుద్ధి చేసి తిరిగి శనివారం వెళ్లిన గ్రామాల మీదుగా పాదయాత్రగా రాత్రి 7.30 గంటలకు అడెల్లి ఆలయానికి చేరుకున్నారు. ఊరూరా మహిళలు మంగళహారతులు, డప్పు వాయిద్యాలతో పోచమ్మ ఆభరణాలకు స్వాగతం పలికారు. ఆ తల్లి ఆభరణాలను చేతితో తాకారు.



ఆభరణాల అలంకరణ అనంతరం భక్తులకు దర్శనమిస్తున్న పోచమ్మ తల్లి

నేల ఆరోగ్యం.. ఫలితాల్లో నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

పంట సాగులో అవసరమైన ఎరువులు వినియోగించేందుకు వీలుగా, మట్టి నమూనాల పరీక్షలు జరిపి రైతులకు నేల ఆరోగ్య కార్డులు అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రయోగాత్మకంగా జిల్లాల వారీగా వెనుకబడిన మండలాల్లో పథకాన్ని అమలు చేయాలనే నీతి ఆయోగ్ సూచనల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల జిల్లా మినహా మిగిలిన మూడు జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేశారు. మట్టి నమూనాలు సేకరించి ఈ నెలాఖరులోగా నేల ఆరోగ్య కార్డులు అందించాల్సి ఉంది. ఇందుకు అవసరమైన వనరులు, సిబ్బంది లేక మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ నత్తనడకన సాగుతోంది.



జిల్లాల వారీగా ఎంపిక చేసిన మండలం, సేకరించాల్సిన మట్టి నమూనాలు

■ జిల్లా ■ మండలం ■ మట్టి నమూనాలు

జిల్లా	మండలం	మట్టి నమూనాలు
ఆదిలాబాద్	నార్నూర్	5,568
కుమురంభీం	తిర్యాణి	4,870
నిర్మల్	పెంబి	3,225



నార్నూర్ మండలంలో మట్టి నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా భూసార పరీక్ష ఫలితాలు ఇవ్వడం లేదు. జిల్లాల విభజనకు ముందు ఆదిలాబాద్ కేంద్రంగా భూసార పరీక్ష కేంద్రం ఉండేది. సేకరించిన మట్టి నమూనాలు పరీక్షించి వాటి ఫలితాలు మండలాలకు పంపేవారు. కానీ అవి రైతులకందేవి కావు. ప్రతి రైతుకు భూసార పరీక్ష ఫలితాల కార్డులు అందించాలని ప్రభుత్వం జిల్లాల విభజన తర్వాత మండల స్థాయిలోనే మినీ భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరికరాలు అందజేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు నమూనాల సేకరించి ఫలితాలే ఇవ్వలేదు. తర్వాత సంచార భూసార పరీక్ష వాహనం వచ్చింది. అది మూలకు చేరింది. కుమురం భీం జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేకపోవడంతో ఆ మండలంలో సేకరించిన నమూనాలు ఆదిలాబాద్ జిల్లాకు పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.



జిల్లా కేంద్రంలోని భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనాల పరీక్ష

సాంకేతికత వినియోగం..

మూడు మండలాల్లో మట్టి నమూనాల సేకరణ నుంచి మొదలు ఫలితాలు అందించే వరకు సాంకేతికతను ఉపయోగించనున్నారు. గతంలో మాదిరిగా కాకుండా వివరాలను సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్ మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మండలంలో ఉండే ఏఈఓలు తమ క్లస్టర్ పరిధిలో అయిదు ఎకరాలకు ఒక మట్టి నమూనాను సేకరించాలి. రైతుకు సంబంధించిన సాగు భూమిలోనే మట్టి నమూనాలు తీసేలా.. జియో ట్యాగింగ్ తప్పనిసరి చేశారు. సంబంధిత ఏఈఓ రైతు చేనుకు వెళ్లి మట్టి నమూనాలను సేకరించి, వివరాలతో పాటు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. సేకరించిన నమూనాలను జిల్లా కేంద్రానికి పంపిస్తే.. సిబ్బంది దాన్ని విశ్లేషించి తిరిగి ఫలితాలను ఆన్‌లైన్ చేస్తారు. నేల ఆరోగ్య కార్డును ఏఈఓ డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ కాపీని రైతుకు అందించాల్సి ఉంటుంది. అవసరం మేరకు సిబ్బంది లేక ఫలితాల విశ్లేషణలో కొంత జాప్యం జరిగిందని, ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, ఈ నెలాఖరులోగా ఫలితాలను ఆన్‌లైన్ చేసి రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి తెలిపారు.

జాతీయ రహదారిపై కొందరు వాహన చోదకులు నిబంధనలు విస్మరించి ఎక్కడబడితే అక్కడ వాహనాలను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. ఇది గమనించని కొందరు వాహనదారులు ప్రధానంగా ద్విచక్రవాహన చోదకులు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. తాజాగా ఆదివారం పిప్పర్‌వాడ వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనదారులు ఢీకొని ఒకరు మృతి చెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల తీరు తెన్నులపై 'న్యూస్‌టుడే' కథనం.



జాతీయ రహదారికి ఇరువైపులా నిలిపి ఉంచిన లారీలు

నిలిపిన వాహనాలు.. ప్రమాద కారకాలు

అసువులు బాసిన గృహిణి

ఇచ్చోడ మండలం ముఖరా(కె)కు చెందిన కుటుంబం కారులో జాతీయ రహదారిపై ఇటీవల ఇచ్చోడ వైపు వస్తుండగా లింగట్ల మూలమలుపు వద్ద రోడ్డుపై నిలిపిన లారీని ఢీకొంది. అందులో ప్రయాణిస్తున్న మహిళ దుర్మరణం చెందగా.. ఆమె భర్త, ఇద్దరు పిల్లలు గాయపడ్డారు. ఆ ప్రాంతంలో ఇది వరకు పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం, జైనథ్

జాతీయ రహదారిపై ఎక్కడా భారీ వాహనాలను నిలపటానికి వీలు లేదు. అలా నిలిపి ఉంచితే నిబంధనలు ఉల్లంఘించినట్లే. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల చోదకులు సేదదీరటానికి జాతీయ రహదారిపై

● జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా నిలిపివేత

సీతాగొంది సమీపంలో, ఇచ్చోడ వద్ద, నేరడిగొండ సమీపంలో, కొరటికల్ మూలమలుపు వద్ద జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పార్కింగ్ స్థలాలు నిర్మించింది. ఆ ప్రాంతాల్లో చోదకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు, స్నానాల గదులు అందుబాటులో ఉంచింది. వాహన చోదకులు ఆ ప్రాంతాల్లో ఆపకుండా జాతీయ రహదారి పక్కన నిర్వహిస్తున్న దాబా హోటళ్లు, పెట్రోలు బంకుల వద్ద రహదారిపైనే వాహనాలను నిలిపి ఉంచుతున్నారు. ఫలితంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

జిల్లాలో ప్రమాదాలు, మృతుల వివరాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	140	169	230
2023	120	128	225
2024(ఇప్పటి వరకు)	110	95	148



రహదారి పైకి సర్వీసు రోడ్డు నిర్మించుకోవాలి. కానీ అలా చేయటం లేదు. పంపుల్లో డీజిల్, పెట్రోలు నింపుకొన్న అనంతరం వాహనాలు నేరుగా వేగంగా జాతీయ రహదారి పైకి వస్తుండటం ప్రమాదకరంగా మారింది.



పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద రహదారిపై నిలిపిన లారీలు

పెట్రోలు బంకుల వద్ద

జాతీయ రహదారి పక్కన పలు చోట్ల పెట్రోలు పంపులు ఉన్నాయి. నిబంధనల మేరకు యజమానులు పంపు వద్ద నుంచి జాతీయ

పొగమంచు వల్ల ఇబ్బందులు

శీతాకాలంలో పొగమంచు సమస్య తీవ్రంగా ఉంటుంది. దట్టంగా పొగమంచు ఏర్పడినప్పుడు రహదారిపై పది మీటర్ల దూరంలో రహదారిపై నిలిపిన వాహనం సైతం కనిపించని పరిస్థితి ఉంటుంది. ఇలాంటప్పుడు రహదారిపై వాహనాలు నిలిపి ఉంచటం అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశాలున్నాయి.

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు

ఆదిలాబాద్ నేర విభాగం, బోథ్, న్యూస్‌టుడే : వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం, నిరాధార వార్తలను వ్యాప్తి చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలు, కథనాలు అన్నీ యథార్థమని నమ్మడానికి వీల్లేదన్నారు. అలాంటి వాటిని నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపినా, ప్రచారం చేసినా నేరమే అవుతుందన్నారు. ఇలా ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా పరుగు



సీఎం కప్ క్రీడా జ్యోతి పట్టుకుని పరుగులో పాల్గొన్న ఎంపీ గోడం నగేష్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, క్రీడాకారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం : సీఎం కప్-2024 పోటీల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న క్రీడా జ్యోతి పరుగు ఆదివారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. మావల బైపాస్ రోడ్డు వద్ద ఎంపీ గోడం నగేష్ వారికి స్వాగతం పలికారు. క్రీడా జ్యోతి పట్టుకుని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణం వరకు 10 కి.మీ.లు పరుగెత్తారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయం పర్యవేక్షకుడు ఎం.డి.రజియొద్దీన్, క్రీడా పాఠశాల శిక్షకులు నంగనూరి రాజు, సాయికుమార్, డీఎస్‌ఏ సిబ్బంది సురేష్, వినోద్, క్రీడాకారులు ఈ పరుగులో పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ తెలంగాణలో క్రీడా పాలసీ అమలు చేస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని, ఇది ఎంతో మంది క్రీడాకారులు, క్రీడా శిక్షకులకు వరంగా మారుతుందని, రానున్న రోజుల్లో తెలంగాణ నుంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులు విశ్వ క్రీడల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్మికులపై ప్రభుత్వాల చిన్నచూపు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : భవన నిర్మాణ రంగ కార్మికులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విశ్రాంత కార్మిక సహాయ అధికారి జగదీశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సినిమా రోడ్డులో కూలీ అడ్డా వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఈ నెల 16న మహాధర్నా చేపడతామని పేర్కొన్నారు.

8 నెలలైనా ఎటూ తేలని పనులు..

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) కింద ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున మంజూరైనా ఇందులో పనుల ఎంపిక, ఆమోదంలోనే ఆలస్యమవుతుండటం విమర్శలకు తావిస్తోంది. అసలే నిధుల కొరత ఉన్న నేపథ్యంలో ఉన్నవాటిని ఖర్చు చేయడంలో తాత్సారం చేస్తున్నారు. ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు.

గ్రామాల్లో, పట్టణంలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన కోసం కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. విద్యా విభాగానికి రూ.2 కోట్లు, తాగునీటికి రూ.కోటి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధన. అవసరమనుకుంటే అంతకంటే ఎక్కువగా కేటాయించుకోవచ్చు. మిగతా రూ.6.50 కోట్లు మురుగు కాలువలు, సీసీ రహదారులు, కమ్యూనిటీ భవనాలు, ఇతర మౌలిక వసతులకు కేటాయించే వెసులుబాటు కల్పించారు. పనుల ఆమోదం కోసం జిల్లా ఇన్‌ఛార్జికి అధికారం కల్పించారు. ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ నుంచి పంపిస్తే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలుపుతారు.



బేల మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌లో జనావాసాల మధ్య ఉన్న ప్రధాన మురుగు కాలువ దుస్థితి ఇది. ఇక్కడ కాలువ నిర్మాణం చేపట్టక కంపుకొడుతోంది.

ఎంపిక, ఆమోదంలో జాప్యం

మొదటి నుంచి పనుల ఎంపికలో, ఆమోదంలో జాప్యం కొనసాగుతోంది. ఇప్పటికి ఎనిమిది నెలలు కావొస్తున్నా ఇంకా పనుల ఆమోదం పైనే తర్జనభర్జన జరుగుతోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని ఈ నిధుల పనులకు తొలి ఆమోదం మార్చి 15న లభించింది. అప్పటి నుంచి ఇది కొనసాగుతూనే ఉంది.

ఆదిలాబాద్ నియోజకవర్గంలో రూ.5.28 కోట్లు మిగులు

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇంకా రూ.5.50 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. బోథ్‌లోనూ కొంత వరకు నిధులు మిగలగా అయిదు రోజుల కిందటే రూ.1.81 కోట్లతో 50 పనులకు ఆమోదం లభించింది. ఆదిలాబాద్ నియోజకవర్గంలోనే పనుల ఎంపికలో ఆలస్యమవుతోంది. నెలన్నర కిందట కాంగ్రెస్ శ్రేణుల నుంచి రూ.5.28 కోట్లతో దాదాపు 190 పనులకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు వచ్చాయి. కానీ మంత్రి ఆమోదం తెలపలేదు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం రూ.1.50 కోట్లతో పట్టణంలోని పలు పనులకు ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపించారు.

రాజకీయ ఉత్కంఠ

ఆదిలాబాద్‌లో భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్‌లో భారాస ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ఉండడం, అటు కాంగ్రెస్ శ్రేణులు పనుల ఎంపిక తాము సూచించినవే జరగాలని పట్టుబడుతుండటంతో రాజకీయ ఉత్కంఠకు తెరలేపింది. గతంలో లోక్‌సభ ఎన్నికల కంటే ముందే బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రూ.3.50 కోట్లతో ప్రతిపాదనలు పంపితే మంత్రి తిరస్కరించారు. బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్ సూచించిన పనులకే మంత్రి ఆమోదం తెలిపారు. నేరడిగొండ మండలంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ తన కోసం పని చేసిన కార్యకర్తల సూచన మేరకు రూ.30 లక్షలతో 12 పనులకు తొలుత మంత్రి సీతక్క ఆమోదం తీసుకున్నారు. ఆడే గజేందర్ రంగంలోకి దిగడంతో ఆ పనుల ఆమోదాన్ని మంత్రి నిలిపివేయడం కాంగ్రెస్‌లోనే చర్చకు దారితీసింది.



ఆదిలాబాద్ మార్కెట్‌లో వెల్లుల్లి

ఘాటెక్కిన వెల్లుల్లి.. కిలో ధర రూ.300

పండగల వేళ వెల్లుల్లి ధర పెరుగుతుండటంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సెప్టెంబరు నెలలో కిలో రూ.250 నుంచి 260 పలికిన వెల్లుల్లి ప్రస్తుతం రూ.300కి చేరింది. బహిరంగ మార్కెట్లో కిలోకు రూ.320 వరకు పలుకుతోంది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి ఆదిలాబాద్ మార్కెట్‌కు వెల్లుల్లి వస్తోంది. వర్షాలు, ఇతర కారణాలతో మార్కెట్‌కు ప్రస్తుతం దిగుమతి తగ్గిపోయింది. డిసెంబరు చివర్లో కొత్త పంట వచ్చేదాకా ఇదే పరిస్థితి ఉంటుందని వ్యాపారులు అంటున్నారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం

మోసపూరిత లింకులతో జాగ్రత్త

భీంపూర్, న్యూస్‌టుడే : మండలంలోని అంతర్గాం యువకుడు అనూప్‌కు వాట్సాప్‌లో PM KISHAN_1.0.apk అప్లికేషన్ యాప్ రావడంతో అనుకోకుండా ఓపెన్ చేశాడు. అతడి ఫోన్ హ్యాక్ అయ్యింది. ఈ యాప్ లింకు అతడు సభ్యుడిగా ఉన్న అన్ని గ్రూపుల్లో పోస్టు అయ్యింది. చివరకు తన ఫోన్‌లోని సిమ్‌ను తీసేసి డేటా మొత్తం క్లియర్ చేస్తేగానీ ఆ పోస్టులు ఆగలేదు. ఇలాంటి అప్లికేషన్ యాప్‌లను ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు.



కెరమెరి ఘాట్ అందాలు



వేసవిలో..

ప్రకృతి ఒడిలో.. మలుపుల్లో

కుమురం భీం జిల్లాలోని కెరమెరి ఘాట్ ప్రకృతి రమణీయతను సంతరించుకుని ఒక్కో సీజన్‌లో ఒక్కోరకంగా మారుతూ ఉంటుంది. మలుపులతో కూడిన దాదాపు అయిదు కిలోమీటర్ల ఘాట్ ప్రయాణం.. ఆహ్లాదాన్నిస్తుంది. చుట్టూ ఎటు చూసినా ఎత్తైన చెట్లతో కూడి పచ్చదనం పర్చుకుని పక్షుల కిలకిలరావాలు, చల్లని గాలి మధ్య ప్రయాణికులు చక్కటి అనుభూతికి లోనవుతారు. అదే వేసవి సమయంలో ఆకులన్నీ రాలిపోయి మోడువారిపోయిన చెట్లతో కనిపిస్తుంది. మూడు నెలల కిందటి వరకు సరైన వానలు లేక ఘాట్ నిర్జీవంగా ఉండగా.. ప్రస్తుతం భారీ వర్షాలతో చెట్లన్నీ చిగురించి చూపరులను ఎంతోగానో ఆకట్టుకుంటోంది. ఆ చిత్రాలే ఇవి. - న్యూస్‌టుడే, కెరమెరి


కూష్మాండ దేవి అలంకరణలోని అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు


ఆలయంలో భక్తుల సందడి

కూష్మాండ దేవిగా బాసర అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం సరస్వతి అమ్మవారు కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి రాజోపచార, చతుషష్టి పూజలు నిర్వహించారు. నవరాత్రులతోపాటు ఆదివారం సెలవు కలిసి రావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. దర్శనానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. నాందేడ్‌కు చెందిన జగదీశ్ మహారాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. కోటి గాజుల మండపంలో విజయవాడ, హైదరాబాద్‌కు చెందిన పలువురు విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మైదానం అనుకుంటే.. గుర్రపుడెక్కలో కాలేసినట్లే!


గుర్రపుడెక్క పేరుకుపోయిన ఖానాపూర్ చెరువు

పచ్చటి మైదానంలా కనిపిస్తున్న ఇది ఖానాపూర్ చెరువు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 114 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఈ చెరువులో చేపలను పెంచి.. విక్రయించి గంగపుత్ర కుటుంబాలు ఉపాధి పొందేవి. తర్వాత చెరువు ఆక్రమణలకు గురికావడంతో మిషన్ కాకతీయ పథకంలో భాగంగా రూ.4.83 కోట్లు వెచ్చించి సుందరీకరణ, అభివృద్ధి పనులు ప్రారంభించారు. పనుల్లో నాణ్యత లేని కారణంగా నిధులన్నీ నీటి పాలయ్యాయి. ప్రస్తుతం ఈ చెరువు కాలుష్య కారకంగా మారింది. పట్టణంలోని మురుగంతా చెరువులో చేరుతుండగా.. మరోవైపు చెరువు మొత్తం ఇలా గుర్రపుడెక్కతో నిండిపోయి కంపుకొడుతోంది.

- ఈనాడు, ఆదిలాబాద్



ఇక క్రీడా పండగ

● 16 నుంచి సీఎం కప్ పోటీలు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడా విభాగం : యువతలో క్రీడా సంస్కృతి పెంపొందించాలని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాలని, వారు విశ్వక్రీడల్లో పతకాలు సాధించాలన్న ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా చీఫ్ మినిస్టర్(సీఎం) కప్-2024 నిర్వహించనుంది. ఈ నెల 16 నుంచి వివిధ వారిగా గ్రామీణ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఆయా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించేందుకు షెడ్యూలును ఖరారు చేసింది. ఈ రెండు నెలల పాటు ఉమ్మడి జిల్లాలోని మైదానాలు పోటీలతో కళకళలాడనుండటం కాకుండా క్రీడా పండగ వాతావరణం నెలకొంటుంది. వర్ధమాన క్రీడాకారులకు తమ ప్రతిభ చాటేందుకు ఇదొక చక్కని వేదిక అవుతుంది.


హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో సీఎం కప్-2024 పోటీల లోగో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మండలస్థాయి : ఈ నెల 22 నుంచి 26 వరకు

జిల్లాస్థాయి.. నవంబరు 4 నుంచి 8 వరకు

అథ్లెటిక్స్.. 100మీ., 400మీ.ల పరుగు, మహిళల వాకింగ్ 400 మీ.లు, పురుషుల వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో

బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్, మిక్స్‌డ్

బాక్సింగ్ : 46, 48, 51, 54, 54-57, 57-60 కిలోల బరువు విభాగాలు

ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ., బ్రెస్ట్ స్ట్రోక్ 50మీ., బ్యాక్ స్ట్రోక్ 50మీ., బటర్‌ఫ్లై 50మీ.

కుస్తీ : 57, 65, 74, 86 కిలోల బరువు విభాగాలు

ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ జట్లు

పోటీలు ఇలా..

సబ్ జూనియర్(14 ఏళ్ల లోపు), యూత్/జూనియర్(18 ఏళ్ల లోపు), మెన్ అండ్ వుమెన్ ఓపెన్(18 ఏళ్లు దాటినవారు) విభాగాల్లో పోటీలు ఉంటాయి.

గ్రామీణస్థాయి..

ఈ నెల 16 నుంచి 19 వరకు.. (అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్) (అథ్లెటిక్స్ విభాగంలో 100 మీ, 400 మీ.ల పరుగు, మహిళలకు వాకింగ్ 400 మీ, పురుషుల వాకింగ్ 800 మీ.లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో)

రాష్ట్రస్థాయి.. నవంబరు 18 నుంచి 22 వరకు

అథ్లెటిక్స్ : 100మీ., 400మీ.ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, మహిళల వాకింగ్ 400మీ.లు, పురుషుల వాకింగ్ 800మీ.లు, షాట్‌పుట్

బాక్సింగ్ : 46-48 కిలోలు, 51-54 " ", 54-57 " ", 57-60 " "

విలువిద్య : ఇండియన్ రౌండ్ 30మీ.లు, రికర్వ్ రౌండ్ 60మీ.లు, కంపౌండ్ రౌండ్ 60మీ.లు

ఈత : ఫ్రీ-స్టైల్ 100మీ., బ్రెస్ట్ స్ట్రోక్ 50మీ.లు, బ్యాక్ స్ట్రోక్ 50మీ.లు, బటర్‌ఫ్లై 50మీ.లు

బ్యాడ్మింటన్ : సింగిల్, డబుల్, మిక్స్‌డ్ డబుల్

కుస్తీ : 57 కిలోలు, 65 కిలోలు, 74 కిలోలు, 86 కిలోలు

షూటింగ్: పిస్టల్ ఈవెంట్స్ 10 మీ.లు, రైఫిల్ 10 మీ.లు, ఓపెన్ సైట్ 10మీ.లు

టేబుల్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్

లాన్ టెన్నిస్ : సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్

జిమ్నాస్టిక్స్ : ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, పొమ్మెల్ హార్స్, రోమన్ రింగ్స్, టేబుల్ వాల్ట్

వెయిట్ లిఫ్టింగ్ : 49 కిలోలు, 55 కిలోలు, 61 కిలోలు, 67 కిలోలు, బాలికల కోసం ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, బ్యాలెన్సింగ్ బీమ్, అన్‌ఈవెన్ బార్, టేబుల్ వాల్ట్

బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, హాకీ, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్, సెపక్‌తక్రా జట్లు

వీరికి బాధ్యతలు..

ఉమ్మడి జిల్లాలో సీఎం కప్ పోటీలు క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా యువజన క్రీడల అధికారులకు అందాయి. జిల్లా విద్యాశాఖతో పాటు అన్ని క్రీడా సంఘాల బాధ్యులు, పీఈటీలు, పీడీలు, సీనియర్ క్రీడాకారులు ఇందులో భాగస్వాములు కానున్నారు.

క్రీడా జ్యోతి పరుగు..

సీఎం కప్ పోటీల నేపథ్యంలో తెలంగాణలోని 33 జిల్లాల్లో క్రీడా జ్యోతి పరుగు నిర్వహిస్తున్నారు. ఈ నెల 6న నిర్మల్, ఆదిలాబాద్, 7న ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రాంతాల్లో క్రీడా జ్యోతి పరుగు ఉంటుందని జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ కార్యాలయం సిబ్బంది పేర్కొన్నారు.

లఘుచిత్రం.. సంస్కృతి ఔన్నత్యం



న్యూస్‌టుడే, దండేపల్లి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతిబింబం బతుకమ్మ పండగ. తొమ్మిది రోజుల పాటు పల్లెల్లో సందడి చేసే ఈ పండగ మన మధ్య స్నేహభావం, ఆత్మీయత, అనుబంధాలు పెంపొందిస్తాయి. పాటల్లో జానపద, చారిత్రకమైన పలు సామాజిక అంశాల పరమార్థాన్ని తెలియజేస్తాయి. ఇంతటి విశిష్టత ఉన్న పండగ గొప్పదనంపై లఘుచిత్రాలను రూపొందిస్తూనే మరోవైపు సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపుతూ దేవాలయాల విశిష్టతను వివరిస్తూ.. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు కృషి చేస్తున్నారు. తాము రూపొందించిన చిత్రాలు, జానపద గేయాలను ప్రపంచానికి తెలిపే విధంగా వివిధ యూట్యూబ్ ఛానళ్లలో విడుదల చేస్తున్నారు.

దేవాలయాల విశిష్టతను తెలియజేస్తూ..

తెలంగాణ పండగలతో పాటు పురాతన దేవాలయాల చరిత్రను తెలియజేస్తూ లఘు చిత్రాలు, వీడియోలు నిర్మిస్తున్నారు లక్ష్మీకాంతాపూర్‌కు చెందిన చిలుకూరి స్వాతి. తెలంగాణలో చారిత్రాత్మక దేవాలయాలు ఉన్నా చాలా మందికి వీటి గురించి తెలియవు. వీటి చరిత్ర, గొప్పదనాన్ని వివరిస్తూ చిత్రాలు నిర్మించి 'ఇంట్రెస్టింగ్ ఫ్యాక్ట్స్ ఆఫ్ యూనివర్స్' అనే ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. వీటితో పాటు బతుకమ్మ విశిష్టత, పండగలకు పుట్టింటితో ఉండే అనుబంధాలను తెలియజేస్తున్నారు.


బతుకమ్మ పాటను చిత్రీకరిస్తూ..

పండగల గొప్పదనాన్ని వివరిస్తూ..

బతుకమ్మ పండగ వచ్చిందంటే దేశ విదేశాల్లో ఉన్న వారు సైతం పల్లెలకు వచ్చి ఆనాటి అనుబంధాలను గుర్తు చేసుకుంటారు. డీజేలు, సౌండ్ బాక్సులు, కోలాటాలకే పరిమితం అవుతున్న నేటి తరుణంలో పండగ విశిష్టత, పాటల్లో దాగి ఉన్న పరమార్థం, గొప్పదనాన్ని తెలుపుతూ మహిళల్లో చైతన్యం నింపేలా జానపద గేయాలు రూపొందిస్తున్నారు భీమారం మండలం దాంపూర్‌కు చెందిన చేగొండ నిరోషా. స్వీయ రచన, నటన, ఎడిటింగ్ చేసి చిత్రాలను నిర్మించి వీటిని యూట్యూబ్‌లో 'ఎంఎస్ఎస్ ఫోక్ వీడియో' ఛానల్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.


బతుకమ్మ ఆట చిత్రీకరిస్తున్న దృశ్యం

ప్రజల్లో చైతన్యం తెచ్చేలా...


అల్లూరి సీతారామరాజు లఘు చిత్రం నిర్మాణంలో..


డబ్బింగ్ చెబుతూ రమారాణి

విజ్ఞానం, వినోదంతో పాటు ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవసరమైన లఘు చిత్రాలు నిర్మిస్తున్నారు మంచిర్యాలకు చెందిన బద్రి రమారాణి. జిజ్ఞాస అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి దీనిద్వారా సమాజహితమైన చిత్రాలను నిర్మిస్తున్నారు. తెలంగాణ చరిత్ర, వారసత్వం, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు చిత్రాలను రూపొందించారు. తెలుగు బోధకురాలైన ఈమె పలు తెలుగు పాఠాలను సైతం గ్రాఫిక్స్‌లో రూపొందిస్తున్నారు.

పల్లె సంప్రదాయాలు ప్రతిబింబించేలా..

పల్లె సంస్కృతి, సంప్రదాయాలు, పండగల విశిష్టతను తెలియజేస్తూ పలు నృత్యాలతో కూడిన జానపద గేయాలు నిర్మిస్తున్నారు దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్‌కు చెందిన ముల్కల్ల మురళి. నటన, దర్శకత్వంలో రాణిస్తూ గుర్తింపు పొందుతున్నారు. యూట్యూబ్‌లో ఫోక్ బ్యాండ్, రుచిత క్రియేషన్స్ ఛానల్‌లో తన వీడియోలు ఉంచుతున్నారు. పల్లెల్లో బతుకమ్మ సందడితో పాటు పట్టణాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడి పండగ వేళ పల్లెలకు వచ్చే మహిళలు తమ పుట్టింటితో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తున్నారు. ఇలా పలు వీడియోలను రూపొందిస్తున్నారు.


పాట ప్రారంభోత్సవంలో మురళి

నవోదయలో ప్రవేశాలకు ఆఖరి అవకాశం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు సోమవారంతో గడువు ముగియనుందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కొడాలి పార్వతి తెలిపారు. దీంతోపాటు 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు సైతం దరఖాస్తులను చేసుకోవాలని, వీటి గడువు ఈ నెల 30తో ముగియనుందని పేర్కొన్నారు. 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశాలకు మొదట సెప్టెంబరు 16వ తేదీ ఆఖరిగా నిర్ణయించినా.. తదనంతరం పొడిగించిదన్నారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

గాంధీ నుంచి బాధితురాలి డిశ్చార్జి

జైనూరు: జైనూర్ మండలంలో జరిగిన హత్యాచారయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదివాసీ మహిళ గాంధీ ఆసుపత్రిలో కోలుకుని ఆదివారం డిశ్చార్జి అయ్యింది. మంత్రి సీతక్కతోపాటు కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆసుపత్రికి వచ్చి ఆమె యోగక్షేమాలు తెలుసుకొని, సొంతూరికి పంపించారు.


పోచమ్మ ఆభరణాలను ఎత్తుకున్న ఎస్పీ జానకి షర్మిల


సాంగ్వి గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగలు శుభ్రం చేస్తున్న పూజారులు


సారంగాపూర్ శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

జనగంగ.. జాతర మురవంగ

దిలావర్‌పూర్, సారంగాపూర్ న్యూస్‌టుడే : గంగనీళ్ల జాతరలో భాగంగా అడెల్లి పోచమ్మ తల్లి ఆభరణాలతో వచ్చిన పూజారులు శనివారం రాత్రి దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వి పోచమ్మ ఆలయంలో జాగరణ చేశారు. ఆదివారం వేకువజామున ఇదే గ్రామ శివారులోని గోదావరి నదిలో పోచమ్మ తల్లి నగల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. తిరిగి అడెల్లి ఆలయానికి చేరుకునే క్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం గ్రామాల భక్తజనం బండారి, కొబ్బరినీళ్లు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎస్పీ జానకి షర్మిల జాతరలో పాల్గొన్నారు. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ జాతరకు దిలావర్‌పూర్‌లో ఇంటి ఆడపడుచులు స్వగ్రామానికి రావడం ఆనవాయితీ. దీంతో ప్రతి ఇంట పండగ వాతావరణం నెలకొంది. దీంతోపాటు గ్రామంలో ఏర్పాటు చేసే ఇథనాల్ పరిశ్రమను తరలించాలని గ్రామస్థులు పెద్ద ఎత్తున నినాదాలతో పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు.

దుస్తులు అమ్మి.. బడిపంతులుగా ఎంపికై


వారసంతలో చెలిమెల రాజు..

న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ : వారిది పెద్ద కుటుంబం.. అతడు పదో తరగతి వరకు చదవడమే కష్టమైంది. తల్లి కూరగాయల విక్రయం.. తండ్రి వీధుల్లో, వారసంతలో దుస్తుల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వారి కష్టాన్ని చూసి తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లకు పెద్దన్నగా మారారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించగానే ఆపేశారు. తాను కూడా తండ్రిలాగే ద్విచక్రవాహనంపై వెళ్లి గ్రామాలు, వారసంతల్లో విక్రయించారు. పదేళ్ల తరువాత దూరవిద్య ద్వారా డిగ్రీ, బీఈడీ, పీజీ పూర్తి చేశారు. పట్టుదలతో చదివి సర్కారు ఉద్యోగాలు సాధించారు మంచిర్యాల జిల్లాకు చెందిన చెలిమెల రాజు. ఆయన ప్రస్తుత డీఎస్సీలో తెలుగు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంకు సాధించారు.

పదేళ్లు ఆపేసి.. ఆపై ప్రయత్నించి

లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన లక్ష్మి, రాయమల్లు దంపతుల పెద్ద కుమారుడు రాజు. అతడి తమ్ముడు ప్రస్తుతం వాణిజ్య పన్నుల శాఖలో డీసీటీఓగా కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ కలిసి ముగ్గురు చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేశారు. తండ్రి అయిదేళ్ల క్రితం మరణించగా అతనే ఇంటికి పెద్దదిక్కయ్యారు. కాగా తన పదో తరగతి 1998లోనే పూర్తి చేశారు. ఆర్థిక ఇబ్బందులు, తల్లిదండ్రుల కష్టాన్ని పంచుకోవాలనే ఉద్దేశంతో చదువును పక్కనపెట్టారు. ఇంటికి చేదోడుగా ఉంటూనే సర్కారు కొలువు సాధించాలనే ఆలోచనలో పడ్డారు. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. 2008-2011లో దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం బీఈడీ, పీజీ పూర్తిచేశారు. గురుకుల కొలువుల ప్రకటన వెలువడటంతో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. అక్కడ విధులు నిర్వర్తిస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యారు. స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా జిల్లాలో రెండో ర్యాంకు సాధించి ఎంపికయ్యారు. భాషా (తెలుగు) పండితుడిగా జిల్లాలో మూడో ర్యాంకు సొంతం చేసుకున్నారు. పట్టుదలతో ప్రయత్నిస్తే ఏదైనా సులువే అని నిరూపించారు రాజు. చదువుకు విరామం వచ్చిందని, విశ్రమించకుండా ఆలస్యమైనా తన లక్ష్యానికి చేరువయ్యారు.

నాలుగు ఉద్యోగాలతో సత్తా


కాందేకర్ శివాజీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే: ఓ అభ్యర్థి ఏకంగా డీఎస్సీ-2024 ఫలితాల జాబితాలో వేర్వేరు కేటగిరిల నాలుగు టీచరు పోస్టులకు ఎంపిక కావడం విశేషం. మావల మండలం బట్టిసావర్గాం పంచాయతీ దుబ్బగూడకు చెందిన నాయీ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కాందేకర్ హన్మాండ్లు-లలిత దంపతుల కుమారుడు శివాజీ స్కూల్ అసిస్టెంటు ఫిజికల్ సైన్సులో రెండో ర్యాంకు, ఎస్ఏ తెలుగులో 15వ ర్యాంకు, భాషా పండిత(ఎల్‌పీ) కేటగిరిలో 32వ ర్యాంకు, ఎస్జీటీ విభాగంలో 70వ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని గ్రహించిన విద్యాశాఖ శనివారం ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికైన వారిని డైట్ కళాశాలకు పిలిపించి వారి నుంచి ఏ పోస్టుకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారో అభ్యర్థన పత్రాన్ని తీసుకున్నారు. నాలుగింటిలో ఫిజికల్ సైన్సు ఉద్యోగానికి శివాజీ తొలి ప్రాధాన్యం ఇస్తూ ఆ పత్రాన్ని సమర్పించారు. శివాజీ డిగ్రీ తర్వాత ఎంఎస్సీ(కెమిస్ట్రీ), ఎంఎ(తెలుగు), బీఎడ్, డీఎడ్‌తో పాటు భాషా పండిత కోర్సులు పూర్తి చేశారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, తదితరులు

బంజారా సమాజ్ ఉన్నతికి కట్టుబడి ఉన్నాం

ఎదులాపురం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : బంజారా సమాజ్ ఉన్నతి కోసం కట్టుబడి ఉన్నామని ప్రజా ప్రతినిధులు స్పష్టం చేశారు. ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2 కోట్లతో ఆదిలాబాద్ పట్టణంలో నిర్మించతలపెట్టిన బంజారా భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్‌తో కలిసి ఎంపీ గోడం నగేష్ భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. బంజారా సంప్రదాయం ప్రకారం జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్, సంత్ శ్రీరామారావు మహరాజ్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ్ సమర్పించారు. సకల హంగులతో భవన నిర్మాణానికి ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్ సహకరించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. అనంతరం ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మాజీ ఎంపీ రాఠోడ్ రమేష్ ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అమర్‌సింగ్ తిలావత్(ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు), జనార్దన్ రాఠోడ్(జడ్పీ మాజీ ఛైర్మన్), రూపావత్ అమర్‌సింగ్, రాఠోడ్ సజన్, రాఠోడ్ భీంరావు(ఈఈటీడబ్ల్యూ), రాఠోడ్ సురేష్(ఈఈఆర్‌అండ్‌బీ), జాదవ్ నరేష్, రాఠోడ్ బాబూలాల్(ఏబీఎస్ఎస్ రాష్ట్ర కోశాధికారి), రాఠోడ్ బాబురావు చౌహాన్(మాజీ మంత్రి కర్ణాటక), రాఠోడ్ రామారావు, కిషన్ చౌహాన్, శ్రావణ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, గుడిహత్నూర్:

? గుడిహత్నూర్ మండలం లింగాపూర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. **- మిలింద్, లింగాపూర్**

✔ పరిశీలించి శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్‌హై, ఎంపీడీఓ గుడిహత్నూర్**

న్యూస్‌టుడే, బేల:

? బేల మండలం సిర్సన్న నుంచి టాక్లి బస్టాండ్ వరకు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రహదారికి ఇరువైపులా చెట్లను నెల రోజుల కిందట తొలగించారు. తొలగించిన కొమ్మలు, కర్రలను రహదారి పక్కనే అలా ఉంచారు. **- నందు, స్థానికులు**

✔ వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- భూపేష్, ఏఈ, జాతీయ రహదారుల సంస్థ**

న్యూస్‌టుడే, బోథ్ :

? బోథ్ మండలం ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర రహదారిపై కౌఠ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. **- వాహనదారుడు, సొనాల**

✔ పిచ్చిమొక్కలను తొలగిస్తాం. **- షకీల్, పంచాయతీ కార్యదర్శి, కౌఠ**

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం:

? ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడలో మురుగు కాలువల్లో పంచాయతీ అధికారులు పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోంది. **- దినేష్, యాపల్‌గూడ**

✔ యాపల్‌గూడలో కాలువల్లో పూడిక తీయించి సమస్య పరిష్కరిస్తాం. **- సత్యానంద్, ఎంపీవో**

చలించిన అన్నదాతలు

వందనం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం టెంబ్రీగూడకు చెందిన పసిపాపకు అన్నదాతలు అండగా నిలిచారు. 'పసి పాప ఆకలి తీర్చేందుకు 6 కిలో మీటర్ల కాలినడక' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. సోనేకస్ చెందిన గుర్నూలే రాజు, టాక్లీకి చెందిన పుల్హర్ శేఖరావు, బేలకు చెందిన వైద్యుడు ఏనుగు సూర్యకాంత్ రెడ్డి డబ్బులు పోగు చేశారు. రెండు నెలలకు సరిపడే రూ.5 వేల విలువైన పాలడబ్బాలు కొనుగోలు చేశారు. ఆదివారం వారి ఇంటికి వెళ్లి అందజేశారు. మరో వైపు మానవతా వాదులు తమ వంతుగా ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తున్నారు.


పసిపాప కుటుంబ సభ్యులకు పాలడబ్బాలు అందజేస్తున్న అన్నదాతలు

నేర వార్తలు

నిలిపిన వాహనాన్ని ఢీకొని యువకుడి దుర్మరణం


ఇందురి హర్షవర్ధన్

జైనథ్, న్యూస్‌టుడే : మహారాష్ట్రలోని కేలాపూర్‌లో అమ్మవారి దర్శనానికి వెళ్లి తిరిగొస్తుండగా జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే చనిపోగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్ఐ పురుషోత్తం, స్థానికుల వివరాల ప్రకారం.. జైనథ్ మండలం కోర్టకు చెందిన ఇందురి విలాస్, జైనథ్‌కు చెందిన పూండ్రు సంతోష్‌రెడ్డి శాంతినగర్‌లో నివాసముంటున్నారు. విలాస్ కుమారుడు హర్షవర్ధన్, సంతోష్‌రెడ్డి కుమారుడు నీరజ్‌రెడ్డి ఇద్దరు స్నేహితులు. ఓ ప్రైవేటు కళాశాలలో ఇద్దరు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరిద్దరు కలిసి స్కూటీపై మహారాష్ట్రలోని కేలాపూర్‌కు శనివారం రాత్రి 8 గంటల సమయంలో అమ్మవారి దర్శనానికి వెళ్లారు. జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉన్న వాహనాన్ని ఆదివారం ఉదయం 6.30 గంటలకు తిరుగు ప్రయాణంలో ఢీకొట్టారు. హర్షవర్ధన్(18) అక్కడికక్కడే మృతిచెందగా తీవ్ర గాయాలపాలైన నీరజ్‌రెడ్డిని స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. ఆపై మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విలాస్ భార్య మృతి చెంది ఏడాది కూడా కావడం లేదు. కుమారుడు హర్షవర్ధన్ మృతితో మళ్లీ ఆ ఇంట్లో విషాదం నెలకొంది. సంతోష్‌రెడ్డికి ఏకైక కుమారుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ఇచ్చోడ, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇచ్చోడలోని నిర్మల్ బైపాస్ వద్ద అర్ధరాత్రి సమయంలో మతిస్థిమితం లేని మహిళ(55)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఘటనలో మహిళ మృతి చెందగా, పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన బస్సు ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న క్రమంలో ఢీకొట్టినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

లారీని ఢీకొట్టిన వ్యాను, చోదకుడి మృతి

భిక్కనూరు, న్యూస్‌టుడే : లారీని వెనుక నుంచి డీసీఎం వ్యాను ఢీకొట్టడంతో చోదకుడు మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి కామారెడ్డి జిల్లా భిక్కనూరు శివారులో చోటుచేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ షేక్ అబిద్(36), క్లీనర్ గొండల్‌వార్ సంతోష్ డీసీఎం వ్యానులో హైదరాబాద్ నుంచి వస్తున్నారు. రామేశ్వరపల్లి బ్రిడ్జి దాటిన తర్వాత జాతీయ రహదారి 44పై ముందుగా వెళ్తున్న లారీని డీసీఎం బలంగా ఢీకొట్టింది. గాయపడిన ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి అంబులెన్సులో తరలించారు. డ్రైవర్ షేక్ అబిద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఆదిలాబాద్ పట్టణంలో చోరీ

ఆదిలాబాద్ నేర విభాగం: పట్టణంలోని కొత్త హౌజింగ్ బోర్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ ఘటన వెలుగు చూసింది. కాలనీలో నివాసముండే సురేష్ జోషి-కవిత జోషి దంపతులు తమిళనాడులో ఉండే కుమారుడి వద్దకు రెండు రోజుల కిందట వెళ్లారు. ఇంటి తాళం పగిలి ఉండటంతో పొరుగు వారు వారికి సమాచారం అందించారు. సురేష్ జోషి బంధువులు వచ్చి పరిశీలించగా బీరువాల్లోని దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు తెలియజేశారు. 60 గ్రాముల బంగారు నగలు చోరీ అయినట్లు సమాచారం. బంధువు రాందేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

హత్యాయత్నం నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : విడిపోయి ఉంటున్న భార్యపై పట్టపగలే భర్త హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడు అభిలాష్‌ను అరెస్టు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. జైజవాన్ నగర్‌కు చెందిన అభిలాష్ మహాలక్ష్మీవాడకు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకొని మనస్పర్థలతో విడిపోయి ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం భార్యపై కత్తితో దాడి చేశాడు.

మాయమైన వాహనాలు ప్రత్యక్షం

బేల, న్యూస్‌టుడే : కామ్‌గార్‌పూర్ సమీపంలోని పెన్‌గంగ వద్ద శుక్రవారం మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి సంయుక్తంగా దాడులు చేసి పలు వాహనాలను సీజ్ చేశారు. శుక్రవారం రాత్రి రెండు జేసీబీలు, ఒక ఆయిల్ ఇంజిన్ బోటు, ఒక టిప్పర్ మాయం చేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం.. దీన్ని తీవ్రంగా పరిగణించడంతో సదరు అక్రమార్కులు మాయం చేసిన వాహనాలను శనివారం రాత్రి తెచ్చిపెట్టారు.

అసంపూర్తిగా పంచాయతీ భవనాలు



తలమడుగు మండలం డొర్లి, కొత్తూర్, పల్సి(బి), లక్ష్మీపూర్, కొసాయి తదితర పంచాయతీల్లో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవనాలు ఏళ్లుగా అసంపూర్తిగానే ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయి. మొదట్లో వచ్చిన కొన్ని నిధులతో గుత్తేదారులు పనులు ప్రారంభించారు. తర్వాత నిధుల విడుదలలో జాప్యం కావడంతో వదిలేశారు. చాలా పంచాయతీల్లో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. **- న్యూస్‌టుడే, తలమడుగు**

అదుపు తప్పితే ప్రమాదమే



ఇంద్రవెల్లి నుంచి ఉట్నూరు మండలం చింతకర్ర పంచాయతీ పరిధిలో నిర్మించిన తారు రోడ్డుపై భారీ వర్షాలకు గండి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇంద్రవెల్లి మార్కెట్ యార్డు పక్కన ఈ గండితో ప్రమాదాలు జరగకుండా ఎస్సై సునీల్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిని గుర్తు తెలియని వ్యక్తులు గుంతలో పడేశారు. **- న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి**

అందంగా ఉన్నానా!

ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ వద్ద నిలిపి ఉన్న ద్విచక్ర వాహనానికి ఉన్న అద్దంలో ఓ గడ్డిచిలుక(మిడత) తనను తాను ఎలా ఉన్నానో చూసుకుంటోంది. కొద్దిసేపటి తరువాత అద్దంలో చూసుకుంటూ అన్ని వైపులా తిరుగుతూ.. అద్దంలో కనిపిస్తున్న ప్రతిబింబాన్ని తలతో పొడుస్తూ కనువిందు చేసింది. ప్రయాణికులు ఈ దృశ్యాన్ని చూస్తూ అక్కడే కాసేపు ఆగిపోయారు. ద్విచక్ర వాహనదారుడు సైతం ఆ గడ్డిచిలుక ఎగిరే వరకు అక్కడే ఉండిపోయాడు. **- ఈనాడు, ఆదిలాబాద్**


ద్విచక్ర వాహన అద్దంలో ప్రతిబింబాన్ని చూసుకుంటున్న గడ్డి చిలుక

దుర్గామాతకు పూజలు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు మండలం లక్కారం, హస్నాపూర్, శ్యాంపూర్, ఎక్స్‌రోడ్‌లో ప్రజలు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్నారు. లక్కారం పంచాయతీ రాంజీగోండ్ నగర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కుటుంబ సమేతంగా, మాజీ సర్పంచి మర్సుకోల తిరుపతి దంపతులు స్థానికులతో కలిసి మహంగాళి పూజలు నిర్వహించారు.

ఆదిలాబాద్ సాంస్కృతికం: జిల్లా కేంద్రంలోని రేణుకానగర్‌లోని రేణుకా మాత ఆలయంలో ఆదివారం గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి రూ.1,11,111 కరెన్సీ నోట్ల దండను వేసి అలంకరించారు. మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు బాలశర్మ అధ్యక్షుడు నామ్‌దేవ్ గౌడ్ ఉన్నారు.


కొరలో కూరగాయల అలంకరణలో అమ్మవారు


కేలాపూర్ అమ్మవారికి ఎమ్మెల్యే దంపతుల పూజలు

భీంపూర్: ఎమ్మెల్యే పాయల్ శంకర్ - ఉమా దంపతులు మహారాష్ట్రలోని కేలాపూర్ ప్రసిద్ధ అమ్మవారి ఆలయాన్ని శనివారం రాత్రి దర్శించుకున్నారు. మాజీ మంత్రి శివాజీరావ్ మోగే సహా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానించారు.

దేవీ దర్శనానికి 5 కి.మీ కాలినడక


దుర్గాదేవి దర్శనానికి కాలినడకన బయల్దేరిన మహిళలు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ముత్నూరు గుట్టపై కొలువుదీరిన దుర్గాదేవిని దర్శించుకునేందుకు మండల కేంద్రానికి చెందిన మహిళలు కాలినడకన చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం గ్రామ పటేల్ మారుతిడొంగ్రేతో పాటు ఆయన సతీమణి సంజీవని ఆధ్వర్యంలో మహిళలు 5 కి.మీ కాలినడకన ముత్నూరుకు చేరుకున్నారు. వారికి గ్రామ పటేల్ హెరకుంద జంగు స్వాగతం పలికారు.

కూరగాయలతో కాళీమాత అలంకరణ

బోథ్, న్యూస్‌టుడే : బోథ్ మండలం కొరలో కాళీమాతను ఆదివారం గ్రామస్థులు దుంపలు, కూరగాయలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్థులు పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో గంగనీళ్ల జాతరకు బయల్దేరారు.


రాంజీగోండ్‌నగర్‌లో దుర్గాదేవికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


కరెన్సీ నోట్ల దండతో అలంకరించిన అమ్మవారు, దర్శనం చేసుకుంటున్న భక్తులు

గ్రామాభివృద్ధికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎంపీ నగేష్, చిత్రంలో ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాభివృద్ధికి పెద్దపీట వేయనున్నామని, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పేర్కొన్నారు. చాందలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాజీ సర్పంచి దారట్ల భాస్కర్, పీఏసీఎస్ డైరెక్టర్ ఆరె మోహన్, నాయకులు డి.కిషన్‌లు పార్టీలో చేరారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు జీవన్, దత్తు, సంతోష్, మయూర్‌చంద్ర, దయాకర్, శ్రీనివాస్, సత్యం, దాసరి రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గుర్తింపు

ఉట్నూరు, న్యూస్‌టుడే : విద్యతో సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. ఆదివారం ఉట్నూరులో ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆదివాసీ విద్యార్థిని మనీషాను సన్మానించారు.


మనీషాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఆదివాసీలు ప్రకృతిని పూజిస్తారు

ఉట్నూరు పీఎమ్మార్సీలో ఓయోస్టర్ సంస్థ నిర్వహించిన గిరిజన విద్యార్థుల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు ప్రకృతిని పూజిస్తారన్నారు.

ఏజెన్సీలో గిరిజనేతరుల దీక్షలు


దీక్షలో గిరిజనేతరులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లిలో ఇళ్లను కూల్చేయడం అన్యాయమని, ఏజెన్సీలోని గిరిజనేతరులకు రక్షణ కల్పించే వరకు ఈ నెల 8 నుంచి నిరవధికంగా రిలే దీక్షలు చేపడతామని ఇంద్రవెల్లి గ్రామ పటేల్ మారుతి డొంగ్రె, గిరిజనేతరుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జాడే నాగోరావు అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలో వ్యాపారులు బంద్ పాటించారు. అంబేడ్కర్ కూడలి వద్ద దీక్ష చేపట్టారు. సంఘం మండల అధ్యక్షుడు సంజయ్ లాహనే, ఉట్నూరు, నార్నూరు మండలాలకు చెందిన గిరిజనేతర నాయకులు దీక్షలో పాల్గొన్నారు.

యువత శ్రమదానం


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న యువత

ఎదులాపురం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద ఉన్న శ్మశానవాటిక(ఖబ్రస్థాన్) పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గమనించిన పట్టణంలోని హఫీజ్ ఆరిఫ్‌ఖాన్, హఫీజ్ ఫిరోజ్, మౌలానా ఫారూఖ్, అజ్జు హుస్సేన్, హఫీజ్ జాఫర్, అబ్దుల్ రహీం, జాహిద్, కైఫ్‌లు తమ మిత్రులతో బృందంగా ఏర్పడి ఖబ్రస్థాన్‌లో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. అక్కడ సిమెంటు బెంచీలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని వారు పేర్కొన్నారు.

పల్లెవాసుల ఆత్మీయ సమ్మేళనం

ఎదులాపురం న్యూస్‌టుడే : జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామస్థులు దశాబ్దాల కిందట పలు కారణాలతో వారి గ్రామాన్ని వీడి ఆదిలాబాద్ పట్టణంలో స్థిరపడ్డారు. దాదాపు 127 కుటుంబాలు గ్రామాన్ని వీడాయి. ఆదిలాబాద్‌లో స్థిరపడ్డ వారందరిని ఒకే వేదికపైకి తీసుకురావాలని గ్రామ మాజీ సర్పంచి తిరుపతి యోచించి అందరిని ఏకం చేశారు. ఇలా వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం స్థానిక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో ఒక చోట చేరి సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయతను పంచుకున్నారు. శివాజీ దుర్గె, మోర విఠల్‌రావు, కల్చప్‌రెడ్డి, లక్ష్మీ, గౌతం, దుర్గం విశ్వంబర్, గున్నాజీ విఠల్ తదితరులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో లక్ష్మీపూర్ గ్రామస్థులు

విద్యాశాఖలో ఆగని వసూళ్ల దందా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణ శివారులోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం అదనపు తరగతుల ప్రారంభానికి దరఖాస్తు పెట్టుకోగా.. ఇటీవల ఆ దస్త్రం వరంగల్ ఆర్జేడీ ఆమోదంతో కార్యాలయానికి చేరుకుంది. ఆ దస్త్రం తమకు తెలియకుండా ఆమోదానికి ఎలా పంపుతారని సెక్షన్ ఉద్యోగితో కలిసి మరో ఉద్యోగి ఏకంగా ఓ అధికారినే నిలదీయడం తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. యాజమాన్యం నుంచి ఎన్ని డబ్బులు తీసుకున్నారంటూ పైఅధికారి ఛాంబరులోనే నిలదీసే ప్రయత్నం చేయడం వారి బరితెగింపునకు అద్దం పట్టింది. ఆ ఉద్యోగులతో వేగలేని ఆ అధికారి చివరకు వారిని బుజ్జగించారంటే పరిస్థితి ఏమేరకు చేయిదాటిందో అర్థం చేసుకోవచ్చు. సదరు పాఠశాల యజమానిని పిలిపించి ఎలాంటి డబ్బులు తీసుకోలేదనే విషయాన్ని ఆయనతో చెప్పించాల్సి వచ్చింది. అంతటితో ఆగకుండా సెక్షన్‌తో సంబంధం లేని ఉద్యోగి మరో ఉద్యోగిని దుర్భాషలాడటం.. వాట్సాప్ సందేశంతో హెచ్చరించడం వంటి చర్యలతో మానసిక వేదనకు గురైన ఆ ఉద్యోగి అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరారు. డిప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగులు తమ వద్దకు వచ్చిన ప్రతి దస్త్రానికి డబ్బులు వసూలు చేస్తూ సీనియర్లపైనే పెత్తనం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాల అనుమతులను చూడాల్సిన సెక్షన్ విభాగ పర్యవేక్షకులు కార్యాలయానికి రాకుండా తన బాధ్యతలను అనధికారికంగా మరొకరికి అప్పగించడం ఈ వివాదానికి దారితీసినట్లు తెలుస్తోంది. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఆ ఉద్యోగుల డిప్యూటేషన్ రద్దు చేస్తేగానీ విద్యాశాఖ కార్యాలయంలో పనులు చక్కబడవనే మాట ఇతర ఉద్యోగుల నోట వినిపిస్తోంది.

మత్తడివాగు ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

తాంసి, న్యూస్‌టుడే : వర్షాలు కురవక పత్తి పంట కాత దశలో దెబ్బతింటోందని.. అధికారులు మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలంటూ వడ్డాడి, హస్నాపూర్ గ్రామాల ఆయకట్టు రైతులు ఆదివారం ప్రాజెక్టు వద్ద ఆందోళన చేశారు. వారం రోజులుగా అధికారులకు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.


మత్తడివాగు ప్రాజెక్టు వద్ద ఆయకట్టు రైతులు

జిల్లావాసికి స్వామి వివేకానంద పురస్కారం


తిరుపతిలో రాజ్‌కుమార్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు రాధాకృష్ణ

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాలకు చెందిన సామాజిక కార్యకర్త బాశెట్టి రాజ్‌కుమార్ ఆదివారం స్వామి వివేకానంద జాతీయ అవార్డు-2024ను అందుకున్నారు. దక్షిణ భారతదేశ బహుజన సాహిత్య అకాడమీ రచయితల సమ్మేళనం తిరుపతిలో నిర్వహించారు. సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. సీపీఆర్, సైబర్ నేరాలు, పర్యావరణ పరిరక్షణ, నాణేల ప్రదర్శన వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో అవార్డును అందజేశారన్నారు.

అడవిపందుల బీభత్సం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: మేరగూడ శివారులోని పత్తి పంటలను అడవి పందులు శనివారం రాత్రి ధ్వంసం చేశాయి. బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్తం

రైతులను అన్యాయం చేస్తున్న కేంద్రం

భుక్తాపూర్, న్యూస్‌టుడే: కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నాయకులు రాములు, షేక్ పాషా, రమేశ్, గణేశ్, నర్సింగ్‌రావు ఉన్నారు.

రెండు పడక గదుల ఇళ్లను వెంటనే ఇవ్వాలి

జైనథ్: జైనథ్ మండలం రాంపూర్‌లో నిర్మిస్తున్న రెండు పడక గదుల ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశం డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రెండో మహా సభలను నూతనంగా ఎన్నికైన కార్యదర్శి గంగన్న ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నాయకులు స్వామి, ఎ.స్వామితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.9.50 లక్షలతో అభివృద్ధి పనులు

పాలనాప్రాంగణం: ఆదిలాబాద్ పట్టణంలో మున్నూరుకాపు భవన సముదాయంలో రూ.9.50 లక్షలతో అదనపు గదుల నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గోడం నగేష్‌తో కలిసి ప్రారంభించారు. నాయకులు శ్రీనివాస్, సంతోష్, రఘుపతి, జైపాల్, శివసాయి, జీవన్, గంగాధర్, బ్రహ్మానంద్, ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

తలమడుగు: మండలంలోని పల్సి(బి)లో ఆదివారం మహారాష్ట్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కొసాయి, దేగామ, ఉమ్రి, పల్సి(కె), తాండ గ్రామాలకు చెందిన 300 మంది రోగులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. మహారాష్ట్ర బ్యాంకు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కాంతారావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాడే స్వామి, రవీందర్‌నాథ్, శేఖర్, పంచాయతీ కార్యదర్శి సచిన్, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, మహాజన్ పటేల్ లచ్చిరాం, పూసం బాపురావు తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్టు సత్తా

కామారెడ్డి క్రీడావిభాగం: కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో రంగారెడ్డి ప్రథమ బహుమతి సాధించగా, ఆదిలాబాద్ ద్వితీయ, వరంగల్ తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా దేవురావు

బేల: పీఆర్‌టీయూటీఎస్ బేల మండల అధ్యక్షుడిగా ఎస్.దేవురావు ఎన్నికయ్యారు. ఇది వరకు మండల అధ్యక్షుడిగా పని చేసిన టీఎన్.స్వామి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడంతో ఆయన స్థానంలో ఆదివారం కొత్త అధ్యక్షుడిగా ఆయనను ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.సంతోష్ ఎన్నికయ్యారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ఆదిలాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడి నివాసంలో ఆయనను కలిసి నియోజకవర్గ రాజకీయపరిస్థితులపై వివరించారు.



పల్లె బాట నుంచి బడికి..

భీంపూర్, న్యూస్‌టుడే : వీరంతా పంచాయతీ కార్యదర్శులు. డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. ఇక బడిబాట పట్టబోతున్నారు. డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులుగా పార్థసారథి(జామిడి, ఇచ్చోడ) ఎస్ఏ ఇంగ్లీషు కేటగిరిలో 71వ ర్యాంకును, చిప్ప శ్రీకాంత్(పార్డి-కె, బోథ్) ఎస్జీటీ విభాగంలో 45వ ర్యాంకును, పోతగంటి ప్రశాంత్(కొలమా, గాదిగూడ) ఎస్ఏ సోషల్ స్టడీస్ విభాగంలో అయిదో ర్యాంకును, కురాడి చంద్రశేఖర్(వాఘాపూర్, మావల) ఎస్జీటీ విభాగంలో 50వ ర్యాంకును, కళ్లెం భోజారెడ్డి(మాదాపూర్, ఇచ్చోడ) ఎస్జీటీ కేటగిరిలో 280వ ర్యాంకు సాధించారు.

